


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 02 ఆగష్టు 2025


## రవాణా శాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి

**ప్రొద్దుటూరు క్రైమ్, ఆగష్టు 1, ప్రభాతవార్త :**

స్థానిక దువ్వూరు బైపాస్ రోడ్డు లో వున్న ప్రాంతీయ ఉప రవాణా కార్యాలయాన్ని శుక్రవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీవో మనీషా అధికారులు మరియు సిబ్బందితో కలిసి మాట్లాడారు. వివిధ రకాల పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని వివరించారు.



# మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్

## కొత్తగా 1.09 లక్షల స్పౌజ్ పింఛన్లకు రూ.520 కోట్లు

## త్వరలో కడప స్టీల్‌ప్లాంట్ పనులు చేపడతాం...

## 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తాం

## ఘరానా మోసగాడు జగన్



**జమ్మలమడుగు, ఆగష్టు 1, ప్రభాతవార్త :**

చేనేతలకు చేయూతనిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు నిర్ణయాన్ని వెల్లడించారు. శుక్రవారం కడప జిల్లా జమ్మలమడుగులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం ఈ ప్రకటన చేశారు. పవర్ లూమ్స్ ఉన్నవారికి 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్ ఉన్నవారికి 200 యూనిట్ల మేర విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈనెల 7వ తేదీన అంతర్జాతీయ చేనేత దినోత్సవం రోజు నుంచి ఈ పథకం అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు పెట్టుబడుల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తన సింగపూర్ పర్యటన విశేషాలను చెప్పారు. ఇదే సమయంలో వైసీపీ విధానాలను ఎండగట్టారు. చంద్రబాబు మాట్లాడుతూ...‘‘రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు, రాష్ట్ర బ్రాండ్ పెంచేందుకు సింగపూర్ వెళ్లొచ్చాను. నేను ఎక్కడ ఉన్నా ఒకటో తేదీన పేదల సేవలో పాల్గొనేలా చూసుకుంటున్నాను. అవసరమైతే నా కార్యక్రమాలు వాయిదా వేసుకుంటాను. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏదో మొక్కుబడిగా కాకుండా ఒక బాధ్యతగా చేస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి రూ.33 వేలకోట్లు వెచ్చిస్తున్నాం. దేశవ్యాప్తంగా పెన్షన్ల కోసం ఇంతపెద్ద మొత్తంలో ఖర్చు చేసేది ఏపీనే. మన రాష్ట్రం తర్వాత తెలంగాణ రూ. 8,170 కోట్లు, కేరళ రూ. 7,295 కోట్లు, హర్యానా రూ.7,194 కోట్లు, వెస్ట్ బెంగాల్, 5,460 కోట్లు, రాజస్థాన్, రూ.5,160 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నారు. 1,08,499 మందికి కొత్తగా వితంతు పెన్షన్లు ఇచ్చేందుకు రూ.43.40 కోట్లు విడుదల చేశాం. రెండు నెలల పాటు పింఛన్లు తీసుకోకపోయినా మూడు నెలలో కలిపి ఒకేసారి ఇస్తున్నాం. ఆస్పత్రుల్లో ఉన్న 14,703 మందికి, వృద్ధాశ్రమాల్లో ఉన్న 20,587 మందికి, ఒక సచివాలయ పరిధి నుంచి మరో సచివాలయ పరిధికి వెళ్లిన 31,496 మందికి, హాస్టళ్లలో ఉంటున్న దివ్యాంగ విద్యార్థులకు 3,683 మందికి ఇస్తున్నాం. ఇవి కాకుండా ఈ నెల నుంచి కొత్తగా 1.09 లక్షల మందికి స్పౌజ్ ఫించన్లు అందిస్తున్నాం. దీనికోసం రూ.520 కోట్లు ఖర్చు పెడుతున్నాం’’ అని సీఎం వివరించారు. చెడగొట్టడం తేలిక..నిలబెట్టడమే కష్టం‘‘దేన్నైనా చెడగొట్టడం, పడగొట్టడం చాలా తేలిక...నిలబెట్టడమే చాలా కష్టం. విధ్వంసం చేయడం నిమిషం పని. గత ఐదేళ్లు అదే జరిగింది. కేంద్రం ప్రాయోజిత పథకాలు నిలిపేశారు. రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారు. మే నెలలో జరిగిన మహానాడు వేదికగా కడప స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామని చెప్పాం. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ముందుకొచ్చింది. రూ.4,500 కోట్లతో తొలి దశ, రూ.11,850 కోట్లతో రెండో దశ పనులు చేపడుతుంది. 2029 కల్లా ఉత్పత్తి ప్రారంభిస్తుంది. ఈ ప్రాజెక్టు వస్తే జమ్మలమడుగుతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాం. సాస్కి పథకం కింద రూ.80 కోట్లతో కేంద్ర పర్యాటకశాఖ పనులు చేపడుతోంది. అందమైన లోయలున్న గండికోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. 100 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఒవైపు గండికోట, మరోవైపు ఒంటిమిట్ట మధ్యలో కడప దుర్గా...ఈ మూడింటిని అనుసంధానం చేస్తే పర్యాటకంగా సీమ అభివృద్ధి చెందుతుంది’’ అని సీఎం వివరించారు. నాలుగు ఉమ్మడి జిల్లాలకు సాగునీరురాయలసీమను రతనాల సీమగా మారుస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటున్నాం. నాడు హంద్రీనీవా, గాలేరి నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. తెలుగుగంగ ద్వారా సీమకు నీళ్లిచ్చాకే చెన్నైకి వెళతాయని చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్. హంద్రీనీవా పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టుకు ఒక్క ఏడాదినే రూ.3,890 కోట్లు ఖర్చు చేశాం. జూలైలోనే మల్యాల ఎత్తిపోతల నుంచి సీమ జిల్లాలకు నీరు విడుదల చేశాం. ఫేజ్ 2 పనులు త్వరలో పూర్తిచేసి కడప జిల్లాలో 37,500 ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గండికోట ప్రాజెక్టు ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తి చేశాను’’ అని ముఖ్యమంత్రి అన్నారు.

**జగన్ ఘరానా మోసగాడు‘‘వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘరానా మోసగాడు.**

సొంత పత్రిక, టీవీని అడ్డంపెట్టుకుని తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సాక్షి మీడియాను అనుసరిస్తే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టే. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన మందలించాల్సింది పోయి...ఇంకా నోటికొచ్చినట్టు మాట్లాడాలని ప్రోత్సహించడాన్ని ఏమనాలి.? పార్టీ అధినేతగా ఉన్న వ్యక్తి తన పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలను క్రమశిక్షణలో ఉంచాలి. వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేస్తుంటారు. ఆనాడు వివేకానందరెడ్డికి గుండెపోటు అని సాక్షిలో వేశారు. తర్వాత గొడ్డలిపోటు అని తేలింది. నా చేతిలో కత్తిపెట్టి నేను చంపించానని రాశారు. బంగారుపాళ్యం పర్యటన దృశ్యాలను నెల్లూరు పర్యటన దృశ్యాలతో కలిపి భారీగా జనం వచ్చినట్లు చూపించారు. జిమ్మిక్కులతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. ప్రజలను మభ్య పెట్టి, మోసం చేసి అసార్యం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం’’ అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. సీమ పారిశ్రామికాభివృద్ధికి రోడ్ మ్యాప్‘‘పారిశ్రామికంగా సీమ అభివృద్ధి కోసం పూర్తిస్థాయి రోడ్ మ్యాప్ తయారుచేశాం. సాగుకు ప్రాధాన్యం ఇస్తూనే పరిశ్రమల రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. ఆటోమొబైల్, స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ఈ ప్రాంతంలో నెలకొల్పేలా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఓర్వకల్లులేపాక్షి మధ్య ఎలక్ట్రానిక్, డిఫెన్స్, ఏరో స్పేస్ పరిశ్రమలను తెస్తాం. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌ల కోసం రూ.5,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. కర్నూలు, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ వస్తే దేశానికి కావాల్సిన డ్రోన్స్ అన్నీ ఇక్కడే తయారవుతాయి. ఆర్ అండ్ బీ రోడ్లన్నీ బాగుచేస్తాం. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ మాత్రమే కాకుండా రూ.43,604 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీలో రూ.44 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 201419 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం రూ.12,441 కోట్లకు పైగా ఖర్చు చేయగా గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. అవుకు, జీడిపల్లి, మారాల, చెర్లోపల్లి, గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం ప్రాజెక్టులు పూర్తి చేసింది టీడీపీనే. సముద్రంలోకి పోయే నీటిని మనం వాడుకుంటే ఏపీ, తెలంగాణలో కరువు ఉండదు. అదృష్టవశాత్తు రాష్ట్రంలో రిజర్వాయర్లు ఉన్నాయి. వాటిలో నీరు నిల్వ పెట్టుకుంటే సాగుకు ఇబ్బంది ఉండదు. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేసే కార్యక్రమానికి టీడీపీనే శ్రీకారం చుట్టింది. దీని వల్ల రైతుల ఆదాయం పెరుగుతోంది’’ అని సీఎం తెలిపారు. రేపే అన్నదాత సుఖీభవ2024 ఎన్నికల్లో ప్రజలు అద్భుత విజయం అందించారు. సుపరిపాలనలో తొలిఅడుగు వేశాం. కేంద్ర సాయంతో కలిపి ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని చెప్పాం. చెప్పినట్టే రేపు అన్నదాత సుఖీభవ కింద రైతులందరికీ డబ్బు జమ చేస్తాం. కేంద్రం ఇచ్చే రూ.2 వేలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కో రైతుకు రూ.5 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. గత ప్రభుత్వం రూ.12,500 ఇస్తామని రూ.7,500 ఇచ్చింది. మన ప్రభుత్వం దాన్ని రూ. 14,000 వేలకు పెంచింది. ఏది రైతు ప్రభుత్వమో, ఏది రైతు వ్యతిరేక ప్రభుత్వమో ప్రజలే నిర్ణయించుకోవాలి. అలాగే 90 శాతం సబ్సీడీతో డ్రిప్ ఇరిగేషన్ ఇస్తే గత ఐదేళ్లలో దాన్ని నిలిపేశారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం’’ అని సీఎం ప్రకటించారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో 12 చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.30 కోట్లు విడుదల చేస్తాం. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.30 కోట్లు మంజూరు చేస్తాం. గండికోట రిజర్వాయర్ ముంపు బాధితులను ఆదుకుంటాం’’ అని భరోసా ఇచ్చారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సీఎంజమ్మలమడుగు మండలం, గూడెంచెరువు గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం ప్రజావేదిక కార్యక్రమానికి హాజరయ్యే ముందు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఉల్సాల అలివేలమ్మ అనే లబ్ధిదారు ఇంటికెళ్లి వితంతు పెన్షన్ అందించారు. కాసేపు వారితో ముచ్చటించారు. అలివేలమ్మ ఇంట్లో ఉన్న చేనేత మగ్గాన్ని పరిశీలించారు. ఆమెకు పింఛను అందజేసి ఇంటినుంచి బయటకు వస్తున్న సమయంలో పక్షవాతంతో బాధపడుతున్న వెలిగండ్ల మునీంద్ర తనకు పింఛను మంజూరు చేయాలని అభ్యర్థించారు. అతని పరిస్థితిని చూసిన సీఎం చంద్రబాబు తక్షణమే మునీంద్రకు పింఛను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి ఆటోడ్రైవర్ జగదీష్ ఆటోలో ప్రజావేదికకు చేరుకున్నారు.










# బొప్పాయి పంట రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం





సమావేశంలో పాల్గొన్న రైతులు, వ్యాపారులు, బొప్పాయి రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి, పక్కనే కుడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డి

**రాజంపేట, ఆగష్టు 1, ప్రభాతవార్త :**

ఒకే జిల్లాలో ఉన్నామని ,ఒక ఊర్లో ఒక ధర ,ఇంకో ఊర్లో ఇంకో ధర ఎలా సాధ్యమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రశ్నించారు. రైతులను దోచుకోవాలనే దళారీ వ్యవస్థను సహించమని స్పష్టం చేశారు. ఉత్తరాది వ్యాపారులు కొనుగోలు చేసే ధరకు, దళారులు రైతులకు చెల్లించే ధరకు ఎంతో వ్యత్యాసం ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. బొప్పాయి రైతులకు గిట్టుబాటుధర కల్పించి న్యాయం చేస్తామని ప్రభుత్వం తరఫున జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి హామీ ఇచ్చారు. శుక్రవారం రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట హార్టికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో బొప్పాయి రైతులు, రైతు సంఘాలు, ట్రేడర్స్ వ్యాపారస్తులతో ధరలపై నిర్వహించిన అవగాహనా సదస్సు కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డిలతో కలిసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. బొప్పాయి పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రైతులు, దళారీ వ్యవస్థ, వ్యాపారస్తులతో సమన్వయం చేసి రైతుకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులతో అన్నారు. త్వరగా దెబ్బతినే బొప్పాయి పంటకు రైతులు, దళారీ వ్యవస్థ, వ్యాపారస్తులతో సమన్వయం చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దళారీ వ్యవస్థ రైతులను మోసం చేస్తున్నట్లు, తూకాల్లో తేడాలు ఉన్నట్లు పలువురు అభిప్రాయాలు వ్యక్తపరిచారని వాటన్నింటినీ బేరీజు వేసుకుని రైతుకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఇదే జిల్లాలో పీలేరులో ఒక రేటు, మదనపల్లిలో మరో రేటు ఉందని దళారులందరూ సిండికేట్ వేసి ఈ ప్రాంతంలో ధరలు తగ్గించారనే ఆరోపణల నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారించి రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మామిడి రైతుల తరహాలో బొప్పాయి పంట రైతులకు నష్టం చేకూరిస్తే సంబంధిత దళారీ వ్యవస్థపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. బొప్పాయి వ్యాపారస్తులు, సేట్లు సిండికేట్‌గా ఏర్పడి ధరలు భారీగా తగ్గిస్తున్నారన్న అంశంపై పూర్తిస్థాయిలో విచారించి దళారుల మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఢిల్లీ నుంచి పంట కొనుగోలు చేసే వ్యాపారస్తులు దళారులకు కిలో 12 రూపాయలు చొప్పున చెల్లిస్తున్నామని అయితే రైతుకు ఏడు రూపాయలు ఇస్తున్నట్లు తెలిపారన్నారు. అనధికారిక దళారులు ఉండటం, ఆ దళారులకు సబ్ దళారులు ఉండడం, రవాణా, సూటులో తేడాలు, హమాలీ ఇతర ఖర్చులు తదితర కారణాలు వెల్లడైనట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు, దళారులు, కొనుగోలు చేసే వ్యాపారస్తుల బృందాలతో సమస్యలు తెలుసుకొని రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. తూకాల్లో మోసాలు జరగకుండా చూడడంతో పాటు కోడూరు చుట్టుపక్కల ప్రాంతాల్లో చెక్పోస్టులు చెక్పోస్టులు ఏర్పాటు చేయించి ఏ లారీ ఎలా వెళ్తుంది అనే విషయాలను కూడా వెలికి తీస్తామన్నారు. రైతులకు నష్టం కలిగించే వ్యవస్థపై దృష్టి సారించి ఆ మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు వివరించారు. ప్రభుత్వం కూడా ఈ అంశంపై దృష్టి సారించిందని వచ్చే వారంలోగా బొప్పాయి పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు వివరించారు. మామిడి టెక్నిక్ తరహాలో రైతులను మోసం చేసే వ్యవస్థను ఎలాంటి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. బొప్పాయి పంట పక్వదశకు రాకముందే కోతలు కోయవద్దని రైతులకు సూచించారు. ఈ సదస్సులో జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి సుభాషిని, ఎడీలు, కోడూరు తాసిల్దారు, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

### ధరపై కుదిరిన ఒప్పందం

రైతులు, ట్రేడర్స్, వ్యాపారస్తులతో బొప్పాయి ధరల నిర్ధారణపై నాలుగు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించి ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఖరారు చేశారు. బొప్పాయి పంట రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఆగస్టు 5 వరకు కిలో 9 రూపాయలు చొప్పున కొనుగోలుకు అంగీకరించిన రైతులు. 6వ తేదీ నుండి కిలో 10 రూపాయలు చొప్పున కొనుగోలు. ఉత్తరాది రాష్ట్రాలలో తీవ్ర వర్షాల నేపథ్యంలో బొప్పాయి పంటకు తగ్గిన డిమాండ్. బొప్పాయి లారీ లోడ్ లను అడ్డగించొద్దని పోలీస్ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# తల్లిపాల ప్రాముఖ్యతను గుర్తించండి

**బద్వేలు అర్బన్, ఆగస్టు 1, ప్రభాతవార్త**



తల్లిపాల ప్రాముఖ్యతను తెలియచెప్పేందుకు జన విజ్ఞాన వేదిక ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేది వరకు వారం రోజులు పాటు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తూ తల్లిపాల ప్రాముఖ్యతను ప్రచారం చేస్తూ ఉన్నదని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ పిల్లలకు తల్లిపాల విశిష్టత ను తెలియ చేస్తూ ఈ సంవత్సరం ఆగస్టు ఒకటి నుండి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తూ ఉన్నది. బి కోడూరు మండలం మేకవారిపల్లె గ్రామం అంగన్ వాడి కేంద్రం నందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం అయిందని దేవ దత్తం తెలియజేశారు. బిడ్డకు జన్మనివ్వగానే తల్లి ప్రసవించిన గంటలోపే శిశువుకు త్రాగించడం వల్ల దేశంలో 2,50,000 శిశు మరణాలను అరికట్టవచ్చువున్నారు ఇవి శిశువుకు మొదటి వ్యాధి నిరోధక టీకాలుగా పనిచేస్తాయి. మొదటి ఐదు రోజులు తాగించే మురుపాలు బిడ్డ పెరుగుదలకు కావలసిన అన్ని పోషకాలు కలగలిగి ఉంటాయి. ఇందులో యాంటీఇన్ఫెక్టిన్ పదార్థాలు ఉంటాయనీ తెలిపారు . డయేరియా, శ్వాసకోశ వ్యాధులుత, అంటు వ్యాధులు నుండి కాపాడతాయి. శిశువు కడుపులో ప్రేగులు పరిణతి చెందటానికి ఈ పాలు ఉపయోగపడతాయి. అజీర్తి కలిగించే మాంసకృతులను శరీరం పీల్చుకోకుండా ముర్రుపాలు నిరోధిస్తాయన్నారు. . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తులసి రామకృష్ణ, యుటిఎఫ్ మండల నాయకులు కొండయ్య, చిన్న విజ్ఞాన వేదిక నాయకులు పవన్, ఉపాధ్యాయులు బ్రహ్మయ్య, శ్రీనివాసులు, రామాంజనేయ రాజు, అంగన్వాడి సిబ్బంది, గ్రామంలోని కొందరు మహిళలు పాల్గొన్నారు.

## ఆగస్టు 1 నుంచి 7 వరకు తల్లిపాల వారోత్సవాలు

**పెండ్లిమర్రి, ఆగస్టు 1, ప్రభాతవార్త:**



ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవం కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పన తెలిపారు. మండలంలోని ఇసుకపల్లె పంచాయతీలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లి తన బిడ్డకు పుట్టిన గంట లోపే ముర్రుపాలు తాపించాలని తల్లిపాలు బిడ్డలకు తాపించడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని వారిలో మేథాశక్తి కూడా పెంపొందించి తల్లిపాలు పిల్లలకు త్వరగా జీర్ణం అవుతాయని తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పి.స్వరూప రాణి, అంగన్‌వాడీ టీచర్లు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంఈఓ గా బాధ్యతలు చేపట్టిన మల్లిక



బద్వేల్ అర్బన్, ఆగస్టు 1, ప్రభాతవార్త

బద్వేల్ మండల విద్యాశాఖ అధికారి1గా యస్. మల్లిక శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆమెకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం బద్వేల్ మండల శాఖ తరపున ఘన స్వాగతం పలికారు. అదే సందర్భంగా ఇటీవల వరకు ఇన్చార్జ్ మండల విద్యాశాఖ అధికారి1గా విధులు నిర్వహించి రిలీవ్ అవుతున్న చెన్నయ్య కు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ తనకు ఇప్పటి వరకు మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అందించిన సహకారం మరువలేనిదని, ఇదే విధంగా కొత్త ఎంఈఓ కు కూడా సంఘం పూర్తి సహకారం అందిస్తుందని నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నాను" అన్నారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన మల్లిక మాట్లాడుతూ -"విద్యార్థుల శ్రేయస్సు, పాఠశాలల బలోపేతం మరియు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం మండల నాయకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మండలంలో పింఛన్ల పంపిణీ విజయవంతం



కలికిరి, ఆగస్టు 1, ప్రభాతవార్త:

14 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్ పర్యవేక్షణలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతమైంది. మండలంలో 6966 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా శుక్రవారం 6626 మందికి పింఛన్లు పంపిణీ జరిగి 95% నమోదైంది. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ మొదటి రోజు పింఛన్ల పంపిణీ వంద శాతం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు డిప్యూటీ ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ సిబ్బందిని అప్రమత్తం చేశారు. కలికిరి మండలానికి కొత్తగా మంజూరైన 140 వితంతు పింఛన్లను పంచాయతీలలో ఆయా ప్రజా ప్రతినిధులతో పంపిణీ చేయడం జరిగింది. కలికిరి పంచాయతీలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డిప్యూటీ ఎంపీడీవో పరిశీలించారు. మర్రికుంటపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, మున్సొళ్లపల్లె పంచాయతీలో సర్పంచ్ శశికళ, పత్తేగడ పంచాయతీలో సర్పంచ్ రెడ్డమ్మలు పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆగిపోయిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు

సుండుపల్లె, ఆగస్టు 01,ప్రభాతవార్త:

మహిళల ఆర్థిక ఎదుగుదల కోసం ఏర్పాటుచేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభించి ప్రారంభ దశలోనే శిక్షణ కేంద్రాన్ని ఆపేసి మహిళలకు మొండి చెయ్యి చూపారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే ప్రారంభించిన మూడు నాలుగు రోజుల్లోనే శిక్షణ కేంద్రాన్ని నిలిపివేశారని పలువురు మహిళలు తెలిపారు. ప్రారంభ దశ నుండి 90 రోజులు వరకు మహిళలకు శిక్షణ ఇచ్చి తరువాత ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని చెప్పి ప్రారంభ దశలోనే ఆపివేయడంతో ఉచిత కుట్టుమిషన్లు కలగానే మిగిలిపోయాయని పలువురు మహిళలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్ఓకు కాంగ్రెస్ బీఫామ్ అందజేసిన భాస్కర్



(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)

కడప జెడ్పిటిసి ఉప ఎన్నికల్లో భాగంగా ఒంటిమిట్ట జడ్పిటిసి సభ్యుడిగా పూల భాస్కర్ ను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి ధృవీకరించిన ఏ మరియు బి ఫారమ్ లు జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ జడ్పిటిసి సభ్యుడుగా పోటీ చేస్తున్న రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పూల భాస్కర్ జడ్పీ కార్యాలయంలో శుక్రవారం ఆర్ వో కు అందజేశారు. అదనంగా మరొక నామినేషన్ పత్రాలు కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ అధ్యక్షుడు కనిశెట్టి నరేష్, రాజంపేట మండల అధ్యక్షుడు మహదేవయ్య, శివయ్య నాయుడు, అమీర్, సుండుపల్లె మండలఅధ్యక్షుడు జమీల్, నరేష్ తదితరు పాల్గొన్నారు.

## గండి క్షేత్రం మార్గంలో అన్నదాన కార్యక్రమం

వేంపల్లె : ఆగస్టు 01 (ప్రభాతవార్త):

శ్రావణ మాసం రెండవ శనివారం సందర్భంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వేంపల్లి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ యోగీశ్వర బాబు తెలిపారు. గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామి దేవస్థానము నందు శ్రావణమాసం రెండవ శనివారం సందర్భంగా ఆలయానికి వేలాదిమంది భక్తులు తరలివస్తారని తెలిపారు. వందలాది మంది భక్తులు ఆంజనేయ స్వామి ని దర్శించుకునేందుకు భక్తి, శ్రద్ధలతో కాలినడకన గండిక్షేత్రంకు చేరుకుంటారని తెలిపారు. భక్తుల ఆకలి తీర్చేందుకు గండి క్షేత్రం మార్గ మధ్యలోని వీరన్నగట్టుపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఉన్న కాశిరెడ్డి నాయన గుడి వద్ద మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో శనివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మానవత మండల శాఖ అధ్యక్షులు డాక్టర్ యోగీశ్వర బాబు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అన్నదాన కార్యక్రమంలో వేంపల్లె మానవతా చైర్మన్ చక్రపాణి రెడ్డి, కో చైర్మన్ కావలి కృష్ణ తేజ, రీజినల్ చైర్మన్ చల్లా బాలాజీ, కార్యవర్గ సభ్యులు, మానవతా డైరెక్టర్ బోర్డు సభ్యులు, అడ్వైజర్ బోర్డు సభ్యులు, మానవత కుటుంబ సభ్యులు పాల్గొంటారని మండల శాఖ అధ్యక్షులు యోగీశ్వర బాబు తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు ఘన స్వాగతం

ప్రొద్దుటూరు ఆగస్టు 01 ప్రభాతవార్త



జమ్మలమడుగు నియోజకవర్గంలో సామాజిక పింఛన్లు గండికోట పర్యాటక ప్రాజెక్టు ప్రారంభించేందుకు కడప ఏర్పాటుకు విచ్చేసిన సీఎం నారా చంద్రబాబు నాయుడుకు శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి సీఎం సురేష్ నాయుడు వాల్మీకి బోయ రాష్ట్ర కార్పోరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కడప ఎయిర్పోర్ట్లో కలిసి పుష్పంతో స్వాగతం పలికాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల లో అభివృద్ధి చెందేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు కురిచేస్తున్నారని వారు ఈ సందర్భంగా కొనియాడారు.

## పోలీసు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ యుగంధర్

పీలేరు ఆగస్టు 01 ప్రభాతవార్త :

పోలీసు చట్టాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పీలేరు పట్టణ సిఐ పి. యుగంధర్ తెలిపారు. శుక్రవారం సిఐ స్థానిక కోటపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాలు అనుసరిస్తూ బాల్య వివాహాలకు దూరంగా ఉంటూ, మంచి విద్యతోపాటు ఉన్నతమైన భవిష్యత్తుకు గట్టి పునాదులు వేసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో చట్టాల పట్ల కూడా తగిన అవగాహన పొందాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల విషయంలో అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు తమ సాధారణ విద్యతో పాటు కెరీర్ గైడెన్స్ లపై అవగాహన, శ్రద్ధ చూపిస్తూ ఏకాగ్రతతో విద్యాభ్యాసంలో ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబు రెడ్డి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సభ్యుల శిక్షణా కార్యక్రమం విజయవంతం



కలికిరి, ఆగస్టు 1, ప్రభాతవార్త:

జైకా ప్రాజెక్ట్ సహకారంతో కలికిరిలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శ్రీజ వీసీజీ/ఎంఆర్జీ మహిళా సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాల శీతలీకరణ ఏరియా మేనేజర్ ఈశ్వరయ్య మాట్లాడుతూ శ్రీజ డెయిరీ అనేది పూర్తిగా మహిళల పాల ఉత్పత్తిదారుల ఆధ్వర్యంలో నడుస్తోందని, 2014 నుంచి 2025 వరకు 7.5లక్షల లీటర్ల పాలు గ్రామ స్థాయిలో సేకరించి మదర్ డెయిరీ సహకారంతో మార్కెటింగ్ చేస్తున్నారని తెలిపారు. శ్రీజ దేశంలో 2వ స్థానంలో ఏపీలో 3వ స్థానంలో నిలిచిందన్నారు. వీసీజీ మరియు ఎంఆర్జీ మహిళా సభ్యుల బాధ్యతలు, ఎంపిక విధానాన్ని వివరించారు. వీరికి చదవడం, రాయడం రావాలి. పాలు తరచుగా సరఫరా చేసే మహిళలను ఎంపిక చేస్తారు. ఎంఆర్జీ సభ్యురాలు 7వ తరగతిపైన చదివి ఉండాలి. వీరి పదవీ కాలం వరుసగా 2 సంవత్సరాలు, 1 సంవత్సరం టుంది. పాల నాణ్యత కోసం శ్రీజ క్యాటిల్ ఫీడ్, మినరల్ మిక్సర్ వాడాలని, మంచి పాలకు తగిన ధర ఇస్తామని జనరల్ ఏపీఎం దేవసేన తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా ఆవుల కొనుగోలుకు నిధులు అందించబడతాయని తెలిపారు. ఏరియా పీఐబీ అధికారి నాగభూషణ యాదవ్ మాట్లాడుతూ శ్రీజ ప్రస్తుతం దక్షిణ భారతదేశంలోని నాలుగు రాష్ట్రాల్లో 1.2 లక్షల మహిళలతో 4వేల గ్రామాల నుంచి పాల సేకరణ చేస్తున్నట్లు తెలిపారు. వీసీజీ/ఎంఆర్జీ సభ్యులు డెయిరీకి, గ్రామ స్థాయి మహిళలకు వవారధిగా పని చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలకు మిల్టన్ వాటర్ బాటిల్, మినరల్ మిక్సర్, ఉమెన్స్ హార్లిక్స్ ఉచితంగా అందించడం జరిగింది. పాల్గొన్న సభ్యులు శ్రీజ, జైకా సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఏరియా సూపర్ వైజర్లు షబ్బీర్, తేజ, పురుషోత్తం, రవి పాల్గొన్నారు.

## పాలికెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

కలికిరి, ఆగస్టు 1, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సిలింగ్ ప్రక్రియ ద్వారా ప్రవేశం పొందిన అనంతరం మిగిలి ఉన్న ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందని ఆ కళాశాల ప్రధానాచార్యులు డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈనెల 4వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తేదీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు కళాశాలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9505504200, 9000498523 నంబర్లను సంప్రదించాలని ఈ అవకాశాన్ని అర్హతగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డా.ఎస్.శ్రీనివాసులు తెలిపారు.

## సీఎం, ఎమ్మెల్యేల చిత్రపటాలకు పాలాభిషేకం



పీలేరు ఆగస్టు 1 ప్రభాతవార్త :

పట్టణంలోని నాలుగవ సచివాలయం పరిధిలో కూటమి శ్రేణులు నూతనంగా పెన్షన్ పొందిన లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చిత్రపఠాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రీబివి రెడ్డి భాష పాల్గొన్నారు. నూతనంగా పింఛన్ పథకానికి అర్హులైన 11 మందికి పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు ఏడాదికి 20,000 చొప్పున మూడు విడతలుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయనుందని, అదేవిధంగా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి 3 వేల రూపాయలు, ఆర్థికంగా రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా చంద్రబాబు నాయుడు చాకచక్యంతో రాష్ట్రానికి కొత్తగా పెట్టుబడులను తెస్తూ యువతకు ఉద్యోగాలు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మరెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టనుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఖాజా పీర్, మిట్టమీద శివ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ అభ్యర్థిగా బిటెక్ సతీమణి నామినేషన్

పులివెందుల, ఆగస్ట్ 1 , ప్రభాత వార్త:

పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నికలో తెలుగుదేశం పార్టీ తరఫున పులివెందుల నియోజక వర్గ ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి సతీమణి లతా రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక స్థానానికి సంబంధించి తెలుగుదేశం పార్టీ తరుపున కూటమి నాయకులు కడపజిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి,రాష్ట్ర మార్క్ఫైడ్ డైరెక్టర్ బీజేపీ సీనియర్ నేత వంగల శశి భూషణ్ రెడ్డి ,కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి సతీమణి మారెడ్డి లతా రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## మండలంలో 95 శాతం పెన్షన్ లు పంపిణి



దువ్వూరు, ఆగష్టు 01, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 15 గ్రామ సచివాలయాల పరిధిలో మండలంలో 95 శాతం పెన్షన్ లు పంపిణి చేసినట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. జిల్లాలో దువ్వూరు మండలం 2వ స్థానంలో ఉందన్నారు. 7237 పెన్షన్ లకు గాను 6887 పంపిణి చేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 350 మందికి పెన్షన్ లు పంపిణి చేయవలసి ఉందని వారికి శనివారం పంపిణి చేస్తాం అన్నారు. అలాగే కొత్తగా 125 మందికి వితంతు పెన్షన్ లు రాగ వాటిని సచివాలయ సిబ్బంది లబ్దిదారులకు అందజేశారన్నారు. పెన్షన్ ల పంపిణిలో జిల్లాలో 2వ స్థానం వచ్చినందుకు సచివాలయ సిబ్బందిని అభినందించారు.

## ఆగస్ట్ 3న జాబ్ మేళా

వీరపునాయునిపల్లి: ఆగస్టు 01 ప్రభాత వార్త;

వీరపునాయన పల్లి లోని వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల నందు ఆదివారం జాబ్ మేళా శ్రీ వీరాంజనేయ సర్వీసెస్ ఏజెన్సీ ద్వారా నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నట్లు స్థానిక టిడిపి నాయకుడు అరుణ్ కుమార్ రెడ్డి తెలిపారు . కొప్పర్తి ఇండస్ట్రియల్ నందు ఏ ఐ ఎల్ డెక్సన్ కంపెనీ లో ఉద్యోగ అవకాశ లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు మండలంలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు అదేవిధంగా ఈ కంపెనీ లో పని చేసే వారికి రూ"12400/నుంచి18000/వేతనం ఉంటుందని అలాగే కంపెనీ వారి బస్సు సౌకర్యం కూడా ఉంటుందని వారు తెలిపారు

## తంబళ్లపల్లె లో నూతన పెన్షన్ల పంపిణీ.



తంబళ్లపల్లె ఆగస్టు 1 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె మండలం లో తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ దాసరిపల్లి చంద్రారెడ్డి ఆదేశాల మేరకు నూతన పెన్షన్ల ను టిడిపి నాయకులు, కార్యకర్తలు పండుగ వాతావరణం లో లబ్ధిదారులకు పంచిపెట్టారు. తంబళ్లపల్లె సిద్ధారెడ్డి గారి పల్లెలో పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర, రేణుమాకులపల్లిలో నీటి సంఘం అధ్యక్షుడు జయశంకర్ రెడ్డి, నిజాముద్దీన్, బిజెపి అధ్యక్షుడు వెంకటరమణ, గుండ్లపల్లి పంచాయతీలో క్లస్టర్ ఇంచార్జ్ కాలా నారాయణ, తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి మధు నాయుడు, సీనియర్ నాయకుడు వీరభద్ర, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో థామస్ రాజా, మాది జెడ్పిటిసి రామచంద్ర లు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మల్లయ్య, లోకేష్ రెడ్డి, జయరామిరెడ్డి, సోమశేఖర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రావణ శుక్రవారం ప్రత్యేక పూజలు

రామసముద్రం ఆగస్టు1 ప్రభాతవార్త

రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామం లో వెలిసిన గ్రామదేవత మారేమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం పర్వదినం రోజున ఆలయాన్ని మామిడి, వేపాకుతో తోరణాలు కట్టి ఆలయ శుద్ధి చేసిగ్రామ దేవత మారేమ్మ కి పలురకాల పుష్పాలు, వేపాకుతో అలంకరణ చేసి నూతన వస్త్రాలు పెట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అమ్మ వారికి పొంగల్ నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి శీనప్ప భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి గ్రామ స్తులచే భజన కార్యక్రమం నిర్వహిస్తారు.

## తిరుమల రెడ్డి పల్లి వాసి కానిస్టేబుల్ కు ఎంపిక

రామసముద్రం ఆగస్ట్ 1 ప్రభాతవార్త



రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన ముని బోయిని శ్రీనివాసులు శుక్రవారం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో చిత్తూరు జిల్లాలో 140మార్కులతో 10వ ర్యాంక్ సాధించి సివిల్ కానిస్టేబుల్ గా ఎంపికయ్యారు. శ్రీనివాసులు తండ్రి నారాయణ తల్లి విజయమ్మ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. చిన్నప్పటి నుంచి శ్రీనివాసులు ఆటలోను చదువులోను ముందుండేవారు. శ్రీనివాసులు పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక కావడంతో తల్లి దండ్రులు, గ్రామస్థులు, స్నేహితులు హార్షం వ్యక్తం చేశారు.

## ఎంపి అరెస్ట్ చేయడం రాజ్యాంగ విరుద్ధమే

రామసముద్రం ఆగస్ట్ 1 ప్రభాతవార్త

రాజంపేట పార్లమెంట్ స్థానం నుండి మూడు సార్లు హేమ హేమీలను ఓడించి ఎంపీగా గెలుపొంది ప్రజానాయకుడిగా మిథున్ రెడ్డి గెలుపొందారని వై ఎస్ ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మహిళా విభాగం అధ్యక్షురాలు తెలిపారు. శుక్రవారం మండల పర్యటన సందర్భంగా విలేకురల సమావేశంలో మాట్లాడుతూ లిక్కర్ కేసులో పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని అనవసరంగా ఇరికించారన్నారు. మిథున్ రెడ్డిని జైలుకు పంపడం చాలా దారుణమని అన్నారు. ఎవ్వరికి ఏఆపదవచ్చిన ఆదుకొనే మంచి మనసున్న వ్యక్తి మిథున్ రెడ్డి అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మినిస్టర్ లోకేష్ కక్ష సాధింపుకి దిగారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజాదరణ ఉందన్నారు. త్వరలోనే ఎంపి మిథున్ రెడ్డి కడిగిన ముత్యంలాగా జైలు నుండి బయటకు వస్తారని చెప్పారు. త్వరలోనే జనం మధ్యకు వచ్చి వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటారని తెలిపారు.ఎంపి మిథున్ రెడ్డి అరెస్ట్ ముమ్మాటికి రాజ్యాంగ విరుద్ధమే అని బీరంగి రేవతి అన్నారు. ఈసమావేశంలో పాల్గొన్నా బీరంగి రేవతి, వైసీపీ స్టేట్ బిసి జనరల్ సెక్రటరీ గెవన్న, ఈశ్వర్ నాయక్, శ్యామల, నాగమని తదితరులు పాల్గొన్నారు.



## కానిస్టేబుల్ గా ఎంపికైన హోంగార్డులు

మదనపల్లి క్రైమ్, ఆగస్టు 1 ప్రభాతవార్త.



మదనపల్లి డివిజన్లో ముగ్గురు హోంగార్డులు, సివిల్ కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికయ్యారు. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో మదనపల్లి డివిజన్లో పనిచేస్తున్న హోంగార్డులు గంగాధర్, విజయ్ కుమార్ నాయక్, ఖాజాపీర్ లు కానిస్టేబుల్ గా ఎంపికయ్యారు. ఈ ఏడాది నిర్వహించిన కానిస్టేబుల్ ఎంపిక పరీక్ష ఫలితాల్లో వీరు ముగ్గురు అత్యధిక మార్కులు సాధించారు. సివిల్ కానిస్టేబుల్ కు ఎంపికైన వీరి ముగ్గురిని మదనపల్లి డి.ఎస్.పి, సిఐలు అభినందించారు.

## కానిస్టేబుల్ కు ఎంపికైన శ్రీకాంత్.

చిట్వేలి,ఆగస్టు 1,ప్రభాతవార్త:



స్థానిక మండలం కేకే వడ్డేపల్లి గ్రామానికి చెందిన రాయన రామచంద్రయ్య సీతమ్మల కుమారుడు రాయన శ్రీకాంత్ శుక్రవారం వెలువడిన కానిస్టేబుల్ ఉద్యోగ ఫలితాలలో అర్హత సాధించినట్లు సోదరుడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఉద్యోగి చరణ్ రాజ్ తెలిపారు. రెండుసార్లు విఫలమైనప్పటికీ, తన సోదరుడు న్యాయవాది జయప్రకాష్ సూచనలతో, పోలీస్ శాఖ ఉద్యోగంపై తనకున్న మక్కువతో మూడవ ప్రయత్నంలో ఈ విజయం సాధించానని,కష్టపడి మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటానని బాధ్యుడు రాయన శ్రీకాంత్ తెలియపరిచారు.ఎంపిక పట్ల కుటుంబ సభ్యులు,గ్రామస్తులు,బంధుమిత్రులు సంతోషం వ్యక్తపరుస్తూ శ్రీకాంత్ కు అభినందనలు తెలియపరిచారు.

## జూనియర్ లైన్‌మెన్ అదృశ్యంపై కేసు నమోదు

### - రూ.3 లక్షల విద్యుత్ బిల్లులతో ఉడాయించినట్లు సందేహం

గాలివీడు, ఆగస్టు 1(ప్రభాతవార్త):

తూముకుంట గ్రామం ప్రకాష్‌నగర్‌కాలనీకి చెందిన జూనియర్ లైన్‌మెన్ కనిపించకపోవడంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 30వ తేదీ బుధవారం రాత్రి 9 గంటలకు ఇంటి నుండి వెళ్లిపోయాడన్నారు. ఈయన కడప సికె దిన్నె మండలంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ మీటరుదారుల వద్ద కరెంటు బిల్లుల రూపంలో దాదాపు రూ.3 లక్షల వరకు అప్పులు చేసి అవి చెల్లించలేక వెళ్లిపోయినట్లుగా వారు తెలిపారు.

## కానిస్టేబుల్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన మండల విద్యార్థులు



మత్తూర్ నాయక్..



శ్రీలేఖ



ఉలవలపల్లె సృజన..

ముద్దనూరు.ఆగస్టు01. ప్రభాతవార్త:

మండల పరిధిలోని విద్యార్థిని విద్యార్థులు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కానిస్టేబుల్ ఫలితాలలో మండలంలోని ఇరువురి విద్యార్థినిలు, ఇరువురు నిరుద్యోగ బాలురులు పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. చిన్న కత్తెర పల్లె గ్రామానికి చెందిన శ్రీలేఖ, యామవరం గ్రామానికి చెందిన ఉలవలపల్లి సృజన, బుక్కే ముత్తూర్ నాయక్, గంగాదేవి పల్లె గ్రామానికి చెందిన నిరంజన్ రెడ్డి లు శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించడంతో కుటుంబ సభ్యులు అభినందించారు.

## పర్యాటకంగా గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

జమ్మలమడుగు ఆగస్టు 1: ప్రభాతవార్త:

పర్యాటకంగా గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం గండికోట వద్ద ఆంధ్రప్రదేశ్ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ కు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గండికోట ప్రాంతాన్ని యాంకర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. ప్రకృతి వరప్రసాదంగా ఏర్పడిన గండికోట ప్రాంతం భారత్ గ్రాండ్ కాన్యన్ గా పేరొందిందని అన్నారు. దీంతో పాటు 13 శతాబ్దంలో కాకతీయులు నిర్మించి, ఆ తర్వాత విజయనగర రాజులు పాలించిన ఈ ప్రాంతం చారిత్రక సంపదకు ప్రతిరూపంగా ఉందని స్పష్టం చేశారు. గండికోట ప్రాంతాన్ని సాస్కి కింద రూ.78 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అద్భుతమైన పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్ల నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాల్లో 50 వేల హోటల్ గదుల నిర్మాణం చేసేలా కార్యాచరణ చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ కూడా సెప్టెంబరు నుంచి మొదలు అవుతాయన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు.








## ల్యాండ్రీ షాపులో అగ్ని ప్రమాదం

పీలేరు, ఆగస్టు 01ప్రభాతవార్త:

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ల్యాండ్రీ షాపులో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలు స్థానిక జెండామాను వద్ద శ్రీనివాసులు ల్యాండ్రీ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో షాపులో మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే బట్టలు దగ్ధమయ్యాయి.


SURNAME CHANGE

My name Ruby w/o: Gogumakula pally Krupanandam (late) D/no: 3/384 Raja Reddy Street, beside of D.C.C.Bank,Kadapa (Dist),A.p., Now I changed my SURNAME GOGUMAKULA PALLY (New) Ruby everbody as follows new surname

## తల్లి పాల వారోత్సవాలు కార్యక్రమం

సిద్ధవటం ఆగస్టు 1 ప్రభాతవార్త



మండలంలోని మాధవరం పంచాయతీ పార్వతీపురం అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించడమైనది కార్యక్రమంలో ఐసిడిఎస్ కడప అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ వాణిశ్రీ మాట్లాడుతూ తల్లి పాల వల్ల పుట్టిన శిశువు కు సరైన ఫోషన అందుతుందని రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అలర్జీ ప్రమాదాలు తగ్గుతాయని తెలిపినారు. ఏ సిడిపిఓ శోభారాణి మాట్లాడుతూ పుట్టిన గంట లోనే శిశువు కు తల్లి పాలు పట్టాలని తెలిపినారు తల్లి పాలు శిశువు కు అమృతం లాంటిదని తల్లి పాలు శిశువు సులువుగా జీర్ణఅవుతాయని బ్రెయిన్ డెవలప్మెంట్ ఉంటుందని తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము మరియు గర్భాశయ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని కుటుంబ సభ్యుల స్నేహ భరిత సేవాభావం సహకారం తల్లికి తన బిడ్డకు చనుబాలు ఇచ్చేందుకు ప్రోత్సాహం మరియు బిడ్డ ఆరోగ్యకరమైన జీవితానికి సహకారం చేస్తుందని తెలిపినారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీ విద్య, అంగన్వాడి కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

## పేదలపాలిట కల్పతరువు ఎన్టీఆర్ భరోసా పెన్షన్

రామాపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి రాంప్రసాద్ రెడ్డి చొరవతో నూతనంగా పెన్షన్లు మంజూరు కావడం ఆనందదాయకంగా ఉందని రామాపురం మండల తెలుగుదేశం నాయకులు ఎస్సీ అంజనారెడ్డి ఆనందాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రామాపురం మండలంలోని నల్ల గుట్టపల్లి గ్రామానికి నూతనంగా 11 ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మంజూరు అయ్యాయని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వితంతు వికలాంగ వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయడంతో నిరుపేదల్లో ఆనందానికి అవధులు లేవని ఇది పేదల పాలిట కల్పతరువు అని అన్నాను. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అయోధ్య పురం పట్టాభిరెడ్డి. అంజనారెడ్డి, చిలేకంపల్లి శివారెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, డాక్టర్ శ్రీనివాసులు, సూరం శివారెడ్డి అయ్యప్ప, చెప్పిడి కృష్ణమూర్తి, చప్పిడి వెంకటేష్ చప్పిడి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరణ

ముద్దనూరు. ఆగస్టు 01. ప్రభాతవార్త:



మండల విద్యాశాఖ అధికారిగా అన్నయ్య స్థానిక ఎంఈఓ కార్యాలయాలలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఉన్నతాధికారుల సాధారణ బదిలీలలో భాగంగా జమ్మలమడుగు పి. ఆర్. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో అసిస్టెంట్ అధికారిగా విధులు నిర్వహిస్తూ ఎంఈఓగా ప్రమోషన్‌పై విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ పాఠశాలలో అభ్యున్నతి కొరకు తన వంతు, కృషి చేస్తానని తెలిపారు.

## పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



బద్వేల్ ఆగస్టు 01. ప్రభాతవార్త:

పరిసరాలను శుభ్రంగా పెట్టుకుంటే, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని బయనపల్లెలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మురికి కాలువల వల్ల అనారోగ్యం, బయట తిండి పదార్థాలను తగ్గించటం, కూల్డ్రింక్స్ బదులు టెంకాయ నీళ్లు, మజ్జిగ తీసుకోవడం, కాచి వడకట్టిన నీటిని త్రాగటం, దోమలను పూర్తిగా నివారించడం లాంటి విషయాలను ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లా మలేరియా అధికారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను చేయడం జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం ఇంటిలో తొట్లు, పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ప్రభుత్వం ఆసుపత్రులలో వైద్యం చేయించుకోవాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలకు పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వీరి జనార్ధన్ రావు, ఏఎన్ఎంలు అఖిలభాను, గంగాదేవి, హెడ్మాస్టర్ రేచల్ రాణి, ఆశ, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీ దుమ్ము నుంచి మమ్మల్ని కాపాడండి

ఎర్రగుంట్ల ఆగస్టు 01 ప్రభాతవార్త



ఎర్రగుంట్ల పురపాలక పరిధిలో ఉన్న ఐసిఎల్ (అల్ట్రాటెక్) ఫ్యాక్టరీ నుంచి విపరీతంగా సిమెంట్ దుమ్ము తో పాటు వస్తుండడంతో దానివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆ దుమ్ము, నుంచి మా వార్డు ప్రజలను మమ్మల్ని కాపాడాలంటూ వైఎస్ఆర్సిపి 17వ వార్డు కౌన్సిలర్ ఎరికల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం 17వ వార్డులో ఈ దుమ్ము, పై యుద్ధం ప్రకటించాడు. ఇంటింటికి తిరిగి ఫ్యాక్టరీ నుంచి వస్తున్న దుమ్ము, తో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వారి ద్వారానే తెలుసుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల పట్టణంలో ఐసిఎల్ (అల్ట్రాటెక్) ఫ్యాక్టరీ నుంచి ప్రతి రోజు విపరీతంగా సిమెంటు దుమ్ము వస్తుందన్నారు. అలాగే సమీపంలో నుంచి రావడంతో ఇళ్లల్లో సామాగ్రిపై పడి ఆహార పదార్థాలపై పడి కలుస్తమవుతున్నాయన్నారు. దుమ్మును నివారించాలని అల్ట్రాటెక్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్తే వారు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. అందుకే ప్రజలందరూ ఏకమై పార్టీలకతీతంగా ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన కార్యక్రమాలను చేపట్టడానికి శ్రీకారం చుట్టబోయే అవకాశం ఉందన్నారు. ఫ్యాక్టరీ వారు స్పందించకపోతే భవిష్యత్తులో ప్రజల మనుగడ ఉండదని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## పందులు కనిపిస్తే... బయటికి తరలిస్తాం

యర్రగుంట్ల ఆగస్టు 01 ప్రభాతవార్త



పురపాలక పరిధిలో పందులు కనిపిస్తే చాలు వాటిని పట్టుకొని బయటికి తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలియజేశారు. శుక్రవారం ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో శాంతినగర్, మార్కెట్ యార్డ్ పక్కన, వేంపల్లి రోడ్డు, శ్రీరాముల పేట, క్రాంతి నగర్ పోలీస్ క్వార్టర్స్, ముద్దనూరు రోడ్డు, టిటిడి కళ్యాణ మండపం సమీపంలో సంచరిస్తున్న పందులను మున్సిపల్ సిబ్బంది పట్టుకున్నారన్నారు. ఇదివరకే పందుల పెంపకదారులతో సమావేశం నిర్వహించామన్నారు. ఆగస్టు ఒకటో తేదీల్లోగా పందులను పట్టణంలో లేకుండా చేయాలని ఆదేశం చామన్నారు. అయితే వారు పట్టించు కోకపోవడంతో పట్టణంలో సంచరిస్తున్న పందులు అన్నిటిని మునిసిపల్ సిబ్బంది పట్టుకుని వాటిని బయటకు తరలిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యం పై ప్రభావం చూపే పందులను ఎర్రగుంట్ల పట్టణం లేకుండా చేస్తామన్నారు. శుక్రవారం రోజు సుమారు 300కు పైగా పందులు పట్టుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఇంకా పట్టణంలో పందులు ఎక్కడైనా సంచరిస్తూ ఉంటే వాటిని పట్టుకుంటామన్నారు.

## ఒంటిమిట్ట జెడ్పిటిసి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు



రాజంపేట, జూలై 31 ప్రభాతవార్త

ఒంటిమిట్ట జెడ్పిటిసి స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా చింతరాజు పల్లె కు చెందిన పార్టీ నాయకుడు బొడ్డే వెంకటరమణ నాయుడు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి, రాష్ట్ర కల్లుగీత ఆర్థిక సహకార సంస్థ మాజీ డైరెక్టర్ కొమర వెంకట నర్సయ్య, సుండుపల్లె మండల టిడిపి నాయకుడు చప్పిడి మహేష్ నాయుడు, స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల అధికారి జడ్పీ సీఈవో ఓబులమ్మకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా విజయ శేఖర్ రెడ్డి కొమర వెంకటనరసయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట జడ్పిటిసి స్థానం తెలుగుదేశం కైవసం చేసుకుంటుందని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థిగా ఎంపిక చేసినా కలిసికట్టుగా పనిచేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. చిన్నచిన్న విభేదాలు నామమాత్రమైనని, అభ్యర్థి గెలుపు మాత్రమే ప్రధానమని పేర్కొన్నారు.

## నాలుగు సెల్ ఫోన్లు రికవరీ

యర్రగుంట్ల ఆగస్టు 01ప్రభాతవార్త

యర్రగుంట్ల రైల్వే పోలీసు వారు రైల్వే స్టేషన్ పరిసరాలలో రైలు నందు పోగొట్టుకున్న సుమారు రూ.53,000 విలువ కలిగిన నాలుగు సెల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్ కుమార్ రెడ్డి తెలియజేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దొంగలను పట్టుకుని వారి వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు వీటి విలువ రూ.53000 ఉంటుందని తెలియజేశారు రికవరీ చేసిన సెల్ ఫోన్ లో బాధితులకు అందించడం జరిగిందన్నారు.

## 9న బాస్ ఆందోళన కార్యక్రమాలకు అనుమతి లేదు

మదనపల్లి క్రైమ్ ఆగస్టు 1 ప్రభాతవార్త.

ఈనెల 9వ తేదీ భారతీయ అంబేద్కర్ సేన (బాస్ ) నిర్వహించ తలపెట్టిన చలో మదనపల్లి, ర్యాలీ లకు అనుమతి లేదని మదనపల్లి డిఎస్పి మహేంద్ర తెలిపారు. శుక్రవారం మదనపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో డి.ఎస్.పి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె అంకిశెట్టిపల్లి వద్ద బుద్ధుడి విగ్రహం ధ్వంసం కేసు విచారణ పూర్తయి కేసును క్లోజ్ చేయడం జరిగిందన్నారు. అయితే ఆ విచారణ తప్పు పడుతూ బాస్ సంస్థ సభ్యులు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారనన్నారు. అంతేకాకుండా మీడియా సమావేశాలు నిర్వహించి తప్పుడు సమాచారం ఇవ్వటం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాస్ సంస్థ నిర్వహించ తలపెట్టిన చలో మదనపల్లి కార్యక్రమంకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. అనుమతులు ఉల్లంఘించి ర్యాలీ నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు.

## ఐ బ్యాంక్ ప్రారంభం

ఎడ్యుకేషన్ ఆగస్టు 1 ప్రభాతవార్త :



కడప నగరంలోని రాజశేఖర్ రెడ్డి ప్రాంగణంలో ఉన్న ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలలో శుక్రవారం ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంక్ ప్రారంభించారు. ఎల్ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఐ బ్యాంక్ విస్తరణ పరిధిలో ఇది అయిదవది. ఈ నేత్ర బ్యాంక్ నకు అవసరమైన పరికరాలను ఇన్ఫోసిస్ సమకూరుస్తుంది. ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల మౌలిక సదుపాయాలను అందిస్తుంది. ఈ సందర్భంగా ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ పట్ల కృతజ్ఞతలు వ్యక్త పరుస్తూ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో టాము అవసరమైన వారికి చేరువై, నేత్ర సంరక్షణా చర్యలు చేపట్టుటకు మరియు నివారించదగిన అంధత్వాన్ని తొలగించుటకు మా దార్శనికత నిరూపణకు దోహదపడుతుందని చెప్పారు. ఎల్ వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల టెక్నాలజీ కమ్యూనికేషన్స్ నెట్వర్క్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ కృష్ణ వడ్డవల్లి మాట్లాడుతూ నేత్రదానం మరియు కార్నియా మార్పిడి విధానాలు చేపట్టే మా ప్రయత్నాలలో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఐ బ్యాంక్ స్థాపన ఒక కీలకమైన ముందడుగు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె ఎస్ ఎస్ .వెంకటేశ్వర రావు, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ రామ గిద్దయ్య అతిధులుగా పాల్గొన్నారు

## సిట్‌తో దర్యాప్తు జరపాలి

మదనపల్లి క్రైమ్, ఆగస్టు 1 ప్రభాతవార్త.



మదనపల్లె అంకిశెట్టిపల్లి వద్ద బుద్ధుడి విగ్రహం ధ్వంసం ఘటనపై సిట్ తో సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్ లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ బుద్ధ విగ్రహం ధ్వంసం విషయాన్ని వ్యక్తిగతంగా తీసుకోవడం తగదన్నారు. అసలు వాళ్ళని వదిలి అమాయకులపై కేసులు నమోదు చేశారని ఆరోపించారు. జిల్లా ఎస్పీ రాజ్యాంగ ఉల్లంగనకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉద్యమకారులను భయభ్రాంతులను గురిచేయాలని చూస్తే సిపిఎం పార్టీ ముందు ఉంటుందన్నారు. అవసరమైతే ఎస్పీని గోబ్యాక్ అని చెప్పడానికి వెనకాడమన్నారు. కార్యక్రమంలో బాస్ సభ్యులు ముత్యాల మోహన్, ఫిరు, గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు కోనేటి దివాకర్, వాల్మీకి సంఘం పొదల నరసింహులు, నల్లబోతుల సుదర్శన్ బాబు పాల్గొన్నారు.

## ఆజ్మీర్ దర్గాలో ఎమ్మెల్యే ప్రార్థనలు

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



చాందర్ సమర్పిస్తున్న ఎమ్మెల్యే

రాజస్థాన్‌లోని పవిత్రమైన అజ్మీర్ దర్గాలో శుక్రవారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కుటుంబసభ్యులతో కలసి ప్రార్ధనలు చేశారు. చాందర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో రైతులు బాగుండాలని అజ్మీర్ దర్గాలో ప్రార్ధనలు చేసినట్లు తెలిపారు. అదే విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో సుపరిపాలనతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకొన్నట్లు తెలిపారు. రాజధాని అమరావతి, పోలవరం త్వరగా పూర్తి కావాలని కోరుకొన్నట్లు తెలిపారు. దర్గా ప్రార్ధనల్లో ఎమ్మెల్యేపాటు తనయుడు జునైద్ అక్బరీ,కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీ అరెస్టు కక్ష సాధింపు చర్య

పీలేరు ఆగస్టు 01 ప్రభాతవార్త:



కలికిరి పట్టణం నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని లిక్కర్ స్కాం పేరిట కూటమి ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వైయస్సార్సీపీ సీనియర్ నాయకులు సతీష్ రెడ్డి ఖండించారు. లిక్కర్ కేసు పేరిట మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్షయ కట్టారని ఆరోపించారు. మిథున్‌రెడ్డి పై కూటమి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడటం దారుణం అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం తగదన్నారు. ఎంపీ మిథున్ రెడ్డిని విడుదల చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## 120 ఎకరాల్లో జికే నేచర్ వ్యాలీ వెంచర్

ఐదు కుంటల విస్తీర్ణంలో ప్రత్యేక ప్లాట్లు



నెచర్‌వ్యాలీ వెంచర్ వ్యూ




మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :

మదనపల్లె సమీపంలోని పుంగనూరు-మదనపల్లె జాతీయ రహదారికి అరకిలోమీటర్ దూరంలో ఉన్న నేచర్ వ్యాలీ(జికె నేచర్‌వ్యాలీ) ఆహ్లాదకర ప్రదేశంలో 120ఎకరాల విస్తీర్ణంలో వెంచర్ వెలిసింది. 5కుంటల విస్తీర్ణంలో ప్లాట్లు ఏర్పాటు చేశారు. ఆహ్లాదకర ప్రదేశంలో వేసిన ఈ నేచర్ వ్యాలీ వెంచర్ 3న ఆదివారం ప్రారంభించనున్నట్లు యాజమాన్యం తెలిపారు. ఈ వెంచర్‌లో ఇళ్ళు నిర్మాణం రెండు కుంటల్లో, మూడు కుంటల్లో మామిడిచెట్లు, కూరగాయలతోటలు ఉంటాయన్నారు. పలు రకాల పూలమొక్కలు, స్విమ్మింగ్‌పూల్, క్రీడామైదానం, క్యాంప్‌ఫైర్, చిల్డ్రన్స్‌ప్లే ఏరియా, లేక్‌బోటింగ్, మినిబార్‌క్లబ్, వాటర్ బాడి, ఇంటరనేషనల్‌స్కూల్, గుడి, ఆరోగ్యకేంద్రం వంటి సౌకార్యలు నేచర్ వ్యాలీలో ఉంటాయన్నారు. పచ్చనిచెట్లతో ఆహ్లాదాన్ని ఇచ్చే కాశ్మీర్, ఊటి, కేరళ, అరకు, మడికేరి, మున్నార్ వంటి పర్యాటక కేంద్రాల్లా ఉండేలా ఈ ప్రదేశం కనువిందు చేస్తుందన్నారు. వెంచర్‌లో విశాలమైన సిసి రోడ్లు వేయడం జరిగిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి లైటింగ్ కల్పించి వేయడం జరుగుతుందన్నారు. పూలతోటల్లో గార్డెన్, వాకింగ్ ర్యాడ్, చిన్నపిల్లలు ఆడుకునే ఆటవస్తువులు జిమ్ చేసుకునేవిధంగా అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా వెంచర్ నిర్వాహకులు టి.క్రిష్ణప్పనాయుడు(టికెవిన్) మాట్లాడుతూ మా నేచర్‌వ్యాలీని చూస్తే ఎక్కడా ఈ విధమైన వెంచర్ చూడలేదని చర్చకు వస్తుందన్నారు. పచ్చనిచెట్లు, చల్లటిగాలి,కంటికి కనిపించే కొండలు, గుట్టలు నేచర్‌వ్యాలీకి అతి సమీపంలో ఉన్నాయన్నారు. బెంగులూరు, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో కూడా ఇలాంటి ప్రకృతి సొయాగాలు వ్యవసాయ పొలాల మద్యన వెంచర్ కనిపించదు అన్నారు. ప్రత్యేకంగా చెట్ల మద్యన నివాసగృహం, సౌండ్ పొల్యూషన్‌కు దూరంగా, ఆహ్లాదకరమైన ప్రదేశంలో వెంచర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు.

## ఇండస్ట్రీయల్ ప్లాట్లను రద్దు చేయాలి

సబ్‌కలెక్టర్‌కు బివైఎస్ నాయకులు వినతి



సబ్‌కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని రూరల్ మండలం మొలకలదిన్నెలో అవినీతికి పాల్పడి కేటాయించిన ఏపిఐఐసి ఇండస్ట్రీయల్ ప్లాట్లను రద్దు చేయాలని బహుజన యువసేన అధ్యక్షులు పునిత్ డిమాండ్ చేశారు. శుక్రవారం బహుజన యువసేన ఆధ్వర్యంలో సబ్‌కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఇండస్ట్రీయల్ ప్లాట్లను రద్దు చేయాలని విన్నవించారు. ఈసందర్భంగా బివైఎస్ అధ్యక్షులు పునిత్ మాట్లాడుతూ ఏపిఐఐసి ఇండస్ట్రీయల్ ప్లాట్లకు ధరఖాస్తులు చేసుకోవాలని ఆన్‌లైన్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా వందలాది మంది ఆసక్తికలిగిన దరఖాస్తు దారుడు రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ధరఖాస్తు చేసుకొన్న ఒక్కప్లాట్‌కు ఒకటికన్న ఎక్కువ ధరఖాస్తులు ఉంటే వేలం నిర్వహించి వేలంలో ఎవరు ఎక్కవ రేటు దక్కించుకుంటే వారికి ప్లాట్ కేటాయించాల్సి ఉంటుందని అయితే ఏపిఐఐసి జోనల్ మేనేజర్, సంబంధిత అధికారులు ఎలాంటి వేలం నిర్వహించకుండా అవినీతికి పాల్పడి నియమ నిబంధనలకు విరుద్దంగా ప్లాట్లు కేటాయించారన్నారు. మరికొన్ని ప్లాట్లు ఆన్‌లైన్ ధరఖాస్తులకన్నా ముందే అక్రమంగా ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారన్నారు. అధికారులు వారికి నచ్చిన విధంగా ప్లాట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఎస్‌సి కేటగిరి కింద ఉన్న ప్లాట్లను జనరల్ కేటగిరికిందకు మార్చి అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ ప్లాట్లు రద్దు చేసి విచారణ జరిపి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిక్రిష్ణ, జిలానిబాషా, నవీన్, శశికుమార్, నిజాం, శ్రీనివాసులు, వినయ్, ద్వారక, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తాం

నిమ్మనపల్లి ఆగస్టు 1 ప్రభాతవార్త



ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు బాబు ఇచ్చిన అన్ని హామీలను కుటమి ప్రభుత్వం అమలు చేయడం జరుగు తోందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి అర్జె వెంకటేష్ అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లి మండలం రాచవేటి వారి పల్లి నందు సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మమేక మయ్యారు. గడిచిన ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. అలాగే రాష్ట్రంలో అమలు జరుగుతున్న అభివృద్ధి పనులను తెలిపారు. నేడే అన్న దాత సుఖీభవ క్రింద రైతుల ఖాతాల్లో నగదు ను ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. అలాగే 15 వ తేది నుండి మహిళలు పార్టీసి బస్సులో ఉచిత ప్రయాణం అందు బాటులోకి వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమం లో శివకృష్ణ, వెంకట రమణ, వీరభద్ర, గోపాలు, శంకర, చల్లా గుర్రప్ప, రుక్మిణి, ప్రగతి, ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

రామసముద్రం ఆగస్ట్ 1 ప్రభాతవార్త




మండలంలోని చెంబకూరు గ్రామపంచాయతీ ఎలకపల్లి గ్రామపంచాయతీ లలో గల అంగన్వాడి సెంటర్లను శుక్రవారం ఎంపిడిఓ తనిఖీ చేశారు. అక్కడ ఉన్న అంగన్వాడీ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగింది. మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో భోజనం ఏర్పాటు చేయాలని ఎంపిడిఓ సూచించారు.అంగన్వాడీ కేంద్రంలో ఉన్న విద్యుత్ వాటర్, పాలు, గుడ్లను పిల్లలు తినే ఆహారం రుచి చూసి మిగిలిన వాటిని పరిశీలించారు. ఏదైనా సమస్యలు ఉంటే మాకు తెలియజేయాలని ఆ సమస్యలు మరొకసారి లేకుండా చూడాలని అంగన్వాడీ టీచర్లకు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో ఎస్. ఏ.గఫూర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్ కమ్మువారి పల్లె గ్రామపంచాయతీ సెక్రటరీ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## 112 కొత్త వితంతు పెన్షన్లు పంపిణీ

గాలివీడు, ఆగస్టు 1(ప్రభాతవార్త):



ఎన్‌టీఆర్ భరోసా పథకం కింద గాలివీడు మండలంలో 288 క్లస్టర్ల ద్వారా 7038 మంది పెన్షన్‌దారులకు పెన్షన్ అందజేశామని ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. అందులో ఆగస్టు మాసంలో స్పౌజ్ కేటగిరీలో కొత్తగా మంజూరైన 112 మంది వితంతు మహిళలకు ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున నగదు అందించామన్నారు. 2019-2024 మధ్య కాలంలో పింఛన్ తీసుకునే భర్తలను కోల్పోయిన మహిళలను ఈ కొత్త లబ్దిదారుల జాబితలో చేర్చడం జరిగిందన్నారు. ఇది ఎంతో మంది నిరుపేద వితంతు మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తోందన్నారు.

## పింఛన్ల పంపిణీ

కురబలకోట ఆగస్టు 1 ప్రభాతవార్త



శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు తంబళ్లపల్లి నియోజకవర్గం ఇన్చార్జి దాసరపల్లి జయచంద్ర రెడ్డి పిలుపుమేరకు కురబలకోట ఎండిఓ గంగయ్య మరియు తెలుగు దేశం నాయకులు వై.జి రమణ మాజీ ఎంపీపీ భూమిరెడ్డి ,తెలుగు యువత నాయకులు అయూబ్ భాషా మరియు సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని నిజమైన లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముదివేడు యువత అఫ్జల్ బాషా ,సిద్దిక్ సయ్యద్ సాబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఆయుబ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో ప్రతి ఇంటి పెద్ద బిడ్డగా ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు వారి ఇంటి కష్టాలను తెలుసుకొని కుటుంబంలో ఇంటి పెద్ద పెన్షన్ వస్తు మరణిస్తేవెంటనే ఆలస్యం చేయకుండా అలాంటి పెన్షన్ ని మరుసటి నెలలో వెంటనే వారికి ఆర్థిక తోడ్పాటు కోసం ఇంటి పెద్ద కొడుకుగా వారికి లబ్ధి చేకూరుస్తున్నారు, ఏపీలో అమలవుతున్న ఈ పింఛన్ల పథకం దేశంలోనే సరికొత్త రికార్డు స్థాయి సంక్షేమ పథకం అని పేర్కొన్నారు.

## డ్రగ్స్‌కు బానిసలు అయితే ప్రాణాలు పోతాయి

పెనగలూరు ఆగస్టు 1 ప్రభాతవార్త



విద్యార్థులు డ్రగ్స్ కు బానిసలు అయితే తర్వాత వాటిని మరిచిపోలేక ప్రాణాలు పోగొట్టుకునే పరిస్థితికి చేరుకుంటారని పెనగలూరు ఎస్సై బీ.రవి ప్రకాష్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పెనగలూరు ఉన్నత పాఠశాలలో ఇన్చార్జి హెడ్మాస్టర్ మహేష్ నాయుడు అధ్యక్షతన జరిగిన విద్యార్థుల సమావేశంలో ఆయన క్రమశిక్షణ మాదక ద్రవ్యాలు మహిళలు చిన్నపిల్లలకు శక్తి టీం రోడ్డు భద్రత నియమాలు గురించి విపులంగా వివరించారు. పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలపై కూడా దృష్టి సారించలేరన్నారు. మహిళలు చిన్నపిల్లలు రక్షణ కోసం ప్రభుత్వం నూతనంగా శక్తి యాప్ను ప్రవేశపెట్టిందన్నారు ఈ యాప్ ను మహిళలు సద్వినియోగం చేసుకుంటే వారికి పోలీసుల రక్షణ పూర్తిగా లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ రాముడు, హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాయుడు సుబ్బరాయుడు కానిస్టేబుళ్లు సుజిత, రవి, మణి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ పెన్షన్లు పొందేవారు ధన్యజీవులు

పెనగలూరు ఆగస్టు 1 ప్రభాతవార్త



ఎన్టీఆర్ పెన్షన్లు పొందే లబ్ధిదారులు ధన్యజీవులని టిడిపి నాయకుడు దాసరి దామోదర్ నాయుడు అన్నారు. శుక్రవారం ముద్రపల్లి, అనంతపల్లి గ్రామ పంచాయతీల పరిధిలో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజల పరిస్థితిని గమనించి వారు కూటికి గుడ్డకు నిత్యవసరాల పోషణకు ఇబ్బంది పడకుండా వృద్ధులు వితంతువులకు 4 వేలు వికలాంగులకు 6 వేలు ప్రత్యేక అవసరాలు గల వికాంగులకు 10వెలనుంచి 15 వేల రూపాయలను నెలనెలా ఇచ్చి ఆయా కుటుంబ సభ్యులను ఆదుకుంటున్నారని సందర్భంగా అన్నారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో భర్త కోల్పోయిన 106 మందివితంతువులకు స్పోజ్ పింఛన్లు మంజూరయ్యాయని అవి కూడా ఈ నెల నుంచి క్రమం తప్పకుండా వితంతువులకు నాలుగు వేల రూపాయలు వంతు న జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

## వార్తా దినపత్రికలో వచ్చిన కథనంతో కదిలిన యంత్రాంగం

గాలివీడు, ఆగస్టు 1(ప్రభాతవార్త):



జులై, ఆగస్టు మాసాలు నిషేధ సమయంలో చేపల వేట కొనసాగిస్తే చర్యలు తప్పవని ఎఫ్‌డీఓ సుబ్బనరసయ్య మత్స్యకారులను హెచ్చరించారు. జులై 30వ తేదీ బుధవారం వార్త దినపత్రికలో "నిషేధాజ్ఞలు ఉల్లంఘన" శీర్షికతో వెలువడిన కథనంతో జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవలాని ఆదేశించడంతో హు టాహుటిన మత్స్యశాఖ అధికారులు శుక్రవారం వెలిగల్లు జలాశయాన్ని పరిశీలించి, మత్స్యకారులు, విక్రయదారులను హెచ్చరించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపలు, గుడ్లు పెట్టి పిల్లలు పునరుత్పత్తి చేసే సమయంలో ఎవ్వరూ చేపల వేట సాగించరాదన్నారు. అనంతరం రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ ఫిషనరీస్ అసిస్టెంట్ రామాంజినాయక్ పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో చోరీ

పీలేరు ఆగస్టు 01 ప్రభాతవార్త:

మండలంలోని ఎర్రగుంటపల్లి పంచాయతీ ముడుపు వేముల వారి పల్లె సమీపంలోని హనుమాన్ టెంపుల్ లో చోరీ జరిగింది గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయంలో ప్రవేశించి హుండీ తీసుకెళ్లారు శుక్రవారం ఆలయ నిర్వాహకులు వచ్చి చూడగా హుండీ లేదు వెంటనే పీలేరు పోలీసులకు సమాజం అందజేశారు . ఆలయ పునర్నిర్మాణం నుంచి ఇప్పటివరకు హుండి తెరవలేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు పీలేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మర్యాదపూర్వక కలయిక

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 1, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు పట్టణ బలిజ సంఘం పెద్దలు పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతిని రాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంచనాలతో చేయాలని మరియు గండికోటలో శ్రీకృష్ణదేవరాయల వంద అడుగుల విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రొద్దుటూరు పట్టణ బలిజ సంఘం గౌరవాధ్యక్షులు, ప్రొద్దుటూరు పట్టణ మాజీ అధ్యక్షుడు సింగంశెట్టి గుమ్మటయ్య (మాజీ కౌన్సిలర్) విన్నవించడం జరిగింది. అందుకు మంత్రి ఆగస్టు 6న జరిగే క్యాబినెట్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించి కచ్చితంగా ఆమోదించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ప్రొద్దుటూరు పట్టణ బలిజ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

## ఫించన్లు పంపిణీలో జిల్లాలో నిమ్మనపల్లె ఫస్ట్

నిమ్మనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :



మండలంలో ఆగస్టు 1న జరిగిన ఫించన్ల పంపిణీలో నిమ్మనపల్లె మండలం జిల్లాలో మొదటిస్థానం దక్కించుకొన్నట్లు ఎంపిడిఓ రమేష్ తెలిపారు. మధ్యాహ్నం 3.10నిమిషాలకు 95.64 శాతం పంపిణీ జరిగిందన్నారు. మండలంలో 5074మంది పించనుదారులకు గానూ 4853మంది పంచన్లు పొందారన్నారు. జిల్లాలో మొదటిస్థానం రావడానికి పించన్లు పంపిణీ చేసిన గ్రామ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ఎంపిడిఓ రమేష్, డిప్యూటి ఎంపిడిఓ బాలరాజు వారికి అభినందనలు తెలిపారు.

# అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం : ఇంచార్జ్ మంత్రి సవిత



మైదుకూరు, ఆగస్టు 01, ప్రభాతవార్త:

రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో స్థానిక మున్సిపాలిటీ 14 వ వార్డు మూలబాట నందు ఇన్చార్జ్ మంత్రి సవిత, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్,అర్హులైన వితంతువు వారికి కొత్తగా మంజూరైన పెన్షన్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మంత్రి సవిత మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యం అవుతుందని రాష్ట్ర ఎన్నికల్లో చంద్రబాబు హామీ మేరకు ఏప్రిల్ 1 నుండి 4000 పింఛను ఇచ్చాం. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల మందికి నెల నెల పింఛన్ పండుగ జరుగుతుంది. గత 13 నెలలుగా 3000 ఉన్న పింఛను 4000, వికలాంగులకు 3000 నుంచి 6000, 5000 రూపాయలు ఉన్న పింఛను 10000, 100 ఉన్నవారికి 15000, వేల రూపాయలు ఇవ్వడం. ఈ ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న విషయం తెలియజేస్తున్నాం. భారతదేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు చేయలేదని ఒకటవ తారీఖున ఇస్తున్న ఏకైక ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేస్తున్నాం. ఈరోజు మైదుకూరు నియోజకవర్గం లో సుమారు 33,000 మందికి పింఛన్లు ఇస్తున్నాం. ఇదేవిధంగా కొత్త పింఛన్లు కూడా 600కు పైగా పింఛన్లు ఇవ్వడం జరుగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష కొత్త పింఛన్లు కూడా ఇస్తున్నామని తెలియజేస్తున్నాం. ఇంకా అర్హులకు కూడా దగ్గర్లో ప్రాసెస్ జరుగుతుంది. వారికి కూడా పింఛన్ అందజేస్తామని విషయం తెలియజేస్తున్నాం. దీపం పథకం కింద సుమారు కోటి చిలర మందికి సిలిండర్లు అందించడం జరిగిందని తల్లికి వందనం రాష్ట్రవ్యాప్తంగా ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికి 67 లక్షల పైగా పిల్లలకు కూడా తల్లివందనం అందజేశాం. ఈరోజు కడప జిల్లా మైదుకూరు నియోజవర్గంలో పుట్టా సుధాకర్ ఆధ్వర్యంలో నూతన వితంతు పింఛన్లు ఇవ్వడానికి నేను ఇక్కడికి రావడం జరిగింది. ప్రజలు కూడా బాగా స్పందించారు. పింఛన్లు, దీపం, అన్నదాత సుఖీభవ, కొత్త పింఛన్లు రావడం అతి తక్కువ కాలంలో పల్లె పండుగ కింద కొన్ని చోట్ల మేము తిరగడం జరిగింది.గత ఐదు సంవత్సరాల కాలంలో కూడా రోడ్లు డ్రైనేజీ వేయకపోవడం వల్ల ప్రజలు చాలా చోట్ల డ్రైనేజీ రోడ్లు అడుగుతున్నారు. మేము కూడా స్థానిక శాసనసభ్యులు ఎన్ఆర్జిఎస్ కింద రోడ్లు డ్రైనేజీలు పనులు చేస్తున్నారు. ఇంకా ప్రజలు కొంతమంది అడుగుతున్నారు వాటిపై కూడా తొందర్లోనే పనులు చేస్తామని తెలిపారు.

**అక్రమ వ్యాపారాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయి,**

పింఛన్ పంపిణీ కార్యక్రమంలో నియోజకవర్గ శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని కడప రోడ్డు జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణ పరిసర ప్రాంతంలో కిరాణా షాపుకు దుకాణం తీసుకుని అక్రమ వ్యాపారం చాపలు, చికెన్, నాటు కోళ్లు, ఇలా చేస్తూ విద్యార్థులకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగజేస్తున్నారని కంప్లైంట్స్ రావడంతో చట్టపరంగా చర్యలు తీసుకున్నామని ఉద్దేశపూర్వకంగా ఎప్పుడు చర్యలు తీసుకోమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ధనపాల్ జగన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర,ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ యాపరాల చిన్న, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు యాపరాల లక్ష్మీనారాయణ, మాజీ మాధవరాయ దేవస్థానం చైర్మన్ ఆకుల క్రిష్ణయ్య,ధనపాల్ రవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మేకల బాబు, తదితరులు పాల్గొన్నారు.

## నాయకుల చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ



ప్రొద్దుటూరు ఆగస్టు 01, ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘ పరిధిలోని 26వ వార్డులో టిడిపి వార్డు ఇన్చార్జ్ తలారి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మూడు వేల నుండి 4 వేల రూపాయలకు పెంచడమే కాకుండా మూడు నెలలు అదనంగా పెంచి పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అలాగే అనేక సంక్షేమ పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సీఎం చంద్రబాబు ప్రజాభిమానం పొందుతున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తున్న సీఎం చంద్రబాబుకు అన్ని రకాలుగా అండగా ఉండాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో డీలర్ కాంచన శ్రీనివాసుల రెడ్డి తలారి దినకర్ తలారి అభిలాష్ పి ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఓం శ్రీ మాత్రే నమః శ్రావణమాసం రెండొవ శుక్రవారం సందర్భంగా ఈరోజు అలంకరణ శ్రీ కనకదుర్గాదేవి ఆలయం బద్వేల్

## రిమ్స్ నందు అన్నదాన సేవ



కడప ఆగస్టు 01, ప్రభాతవార్త:

అన్నదానం మహాదానం అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో, కడప రిమ్స్ నందు ప్రతి మంగళ వారం మరియు శుక్రవరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి వారి తండ్రి జ్ఞాపకార్థం 2024 నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.కడప జిల్లా సుదూర ప్రాంతాల నుంచి వైద్యం కోసం, తమ వారి వైద్య సహాయార్థం మరియు తమకు తెలిసిన వారిని పలకరించడం కోసం వచ్చి తమ దగ్గర ఉన్న డబ్బు సరిపోక ఇబ్బంది పడే వారికి సమయానికి ఆహార అందించాలనే ఉద్దేశంతో వారి అవస్తని గమనించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందిని తెలిపారు. ప్రతీ వారం సుమారుగా 1000 భోజన పొట్లాలు మరియు మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు పంచు తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రిమ్స్ లో మార్చురి వార్డ్ దగ్గర్లో గల మెంటల్ రీహాబిలిటేషన్ సెంటర్ నందు 70 మందికి అదనంగా పంచుతున్నట్లు తెలిపారు ..ఈ కార్యక్రమంలో భాగంగా తమ విద్యా సంస్థలో చదువుతున్నా విద్యార్థులు స్వచందగా ముందుకు వచ్చి ప్రతీ వారం 10 మంది భోజన ప్యాకెట్ ప్యాకింగ్ మరియు వితరణ సమయానికి రిమ్స్ నందు సహకరిస్తున్నారు అని తెలిపారు.

## తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా



బద్వేలు, ఆగస్టు 1, ప్రభాతవార్త

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా అని, అలాగే తల్లిపాలతో బిడ్డలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల దినోత్సవం సందర్భంగా గోపవరము మండల పరిధి పెద్ద గోపవరం అంగన్ వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు హక్కు, బిడ్డ భవితకు బలమైన పునాది, మరియు రోగవిరోధక శక్తి పెరుగుతుంది. సులువుగా జీర్ణం అవుతాయన్నారు. బ్రెయిన్ డెవలప్ మెంట్ అవుతుందన్నారు. మరియు తల్లి బిడ్డల మధ్య అనుబంధం ధృఢ మవుతుందన్నారు. . ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు. సత్యవతమ్మ, ఏ ఎన్ ఎం. గౌసియా మరియు పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు

## చట్టాలపై అవగాహన పెపొందించుకోవాలి



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 1 ప్రభాతవార్త :

ప్రతి ఒక్కరూ చట్టలపై అవగాహన పెంచుకోవాలని షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అలీ షేర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ప్రొద్దుటూరు పట్టణం ఈశ్వర రెడ్డి నగర్ లోని కార్యాలయంలో నూతనంగా కొంత మందిని సంస్థలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలామందికి చట్టాలపై అవగాహన లేదని ప్రతి ఒక్కరూ చట్టలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వాటిని పరిష్కరించడానికి సంస్థ సభ్యులు ఏ మాత్రం తగ్గకుండా ముందుకు వెళ్ళాలని తెలిపారు. అన్ని వేళలా సభ్యులకు అండాగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై అఫ్జల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి రియాజ్ అలీ ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కె జమీర్ అహమ్మద్, కడప జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సలీం, కడప జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ షేక్ జైనుల్, కడప జిల్లా సంయుక్త కార్యదర్శి సమీర్ అహమ్మద్, ప్రొద్దుటూరు సభ్యులు అర్షా, వైఎండి రఫీ పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారం



పెద్దమండెం ఆగస్టు 1 ప్రభాతవార్త

పురిటి బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కారమని ఐసిడిఎస్ సూపర్వైజర్ నౌజియా బేగం అన్నారు ఆగస్టు ఒకటి నుండి వారం రోజులపాటు ప్రపంచం తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి మెడికల్ ఆఫీసర్ హరికుమార్ గర్భవతులు బాలింతలు సున్నా ఆరు సంవత్సరాల పిల్లలు అంగన్వాడి టీచర్లు హెల్పర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురిటి బిడ్డ నుండి ఆరు నెలల వరకు తల్లి పాలను పట్టించడం బిడ్డకు తల్లికి ఆరోగ్యమని అన్నారు అలా బుడ్డి పా లు పాటించడం తల్లికి బిడ్డకు అనారోగ్య పరిస్థితులను కల్పిస్తుందని ఆమె అన్నారు కావున పిల్లలకు తల్లిపాలే అన్ని విధాల ఆరోగ్యవంతమని ఆమె పేర్కొన్నారు గర్భవతులు బాలింతలు పుష్టిక ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగానూ మానసిక రుగ్మతల నుండి అక్షింపబడతారన్నారు. కార్యక్రమంలో హెల్పర్స్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు



బద్వేలు, ఆగస్టు 1 ప్రభాతవార్త

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితేష్ రెడ్డి, డిసిసి బ్యాంక్ జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి లు పేర్కొన్నారు. శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 32వ మున్సిపల్ వార్డులో ప్రారంభం అయిన పెన్షన్ ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక లబ్ధిదారులకు పెన్షన్లు అందజేస్తూ, గడప గడప కు వెళ్లి ఆత్మీయం గా పలకరిస్తూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న పలు రకాల పెన్షన్ లు, వాటి అమలు విధానాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. వృద్ధులు, దివ్యాంగులు, వికలాంగులు, నిరుపేదలకు భరోసా కలిగించేలా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయనీ తెలిపారు.

## పులివెందుల జడ్పీటీసీనీ
# చంద్రబాబుకు కానుకగా ఇస్తాం



పులివెందుల, ఆగస్ట్ 1,ప్రభాత వార్త:

పులివెందుల జడ్పీటీసీనీ గెలిచి సీఎం చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇస్తామని ,పార్టీ బలోపేతానికి ఉపయోగపడే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం అని పార్టీ బలోపేతం చేయడమే లక్ష్యంగా జడ్పిటిసి ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నామని నియోజవర్గం ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక తెదేపా కార్యాలయం నందు శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జడ్పిటిసి స్థానానికి తన సతీమణి లతా రెడ్డి మరియు తమ్ముడు జయభరత్ రెడ్డి నామినేషన్ వేస్తున్నారు అని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పోటీ చేస్తున్నామని ఆయన తెలిపారు.ఈ ఎన్నిక తెలుగుదేశం పార్టీ బలోపితానికి ఎంతో తోడ్పడుతుందనీ పులివెందులలో ఏ చిన్న అవకాశం వచ్చినా కూడా తెలుగుదేశం పార్టీ సద్వినియోగం చేసుకుంటుందనీ కూటమి ప్రభుత్వం అధికారం ఏర్పడినప్పుడు నుంచి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించామ న్నారు.పింఛన్లు మూడు వేల రూపాయల పెంపు, రైతులకు డ్రిప్ పైపులు,ఆగస్టు రెండో తేదీన అన్నదాత సుఖీభవ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సులు కూడా అందుబాటులోకి తెస్తుంది ఇక్కడ గెలిచి ముఖ్యమంత్రి చంద్రబాబుకి కానుకగా ఇస్తామని చెప్పారు.మా మండల నాయకులతో గ్రామ స్థాయి నాయకులతో సమావేశం ఏర్పాటు చేసుకొని ఎన్నికల్లో గెలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు.

## మహా కుంభాభిషేక మహోత్సవం

నిమ్మనపల్లి ఆగస్టు 1 ప్రభాతవార్త



అన్నమయ్య జిల్లా, నిమ్మనపల్లి మండలం, తవళం గ్రామంలో వేంచేసియున్న శ్రీ యోగ నేలమల్లేశ్వర స్వామి వారి కలాన్యాస శిఖర జీవద్వజ ప్రతిష్టాసహిత శ్రీ కామేశ్వరి అమ్మవారు శ్రీ మహాగణపతి పునః ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవము రేపటినుండి అనగా 2.8 .2025 శనివారం నుండి 4. 8 .2025 సోమవారం వరకు అనంతపురం శ్రీ శివ కోటి మహాలక్ష్మి పీఠాధిపతులు శ్రీ శ్రీ అప్ప స్వామి వారి అనుగ్రహ శుభాశీస్సులచే ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడును. రెండవ తేదీ శనివారం 8 గంటలకు మహ గణపతి పూజ తో ఈ కార్యక్రమము ప్రారంభించబడి 3వ తేదీ ఆదివారము శిఖర కలశ స్థాపన, జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట జరుగును. 4వ శ్రీ నేలమల్లేశ్వర స్వామి వారి కలాన్యాసము శ్రీ మహాగణపతి శ్రీ కామేశ్వరి అమ్మవారి పునః ప్రతిష్ట కుంభాభిషేక మహోత్సవము నిర్వహించబడును అనంతరం 11 గంటలకు శ్రీ కామేశ్వరీ సమేత నేలమల్లేశ్వర స్వామి వారి కల్యాణోత్సవము జరుపబడును. ఈ మూడు రోజులు మదనపల్లి వాస్తవ్యులు గుత్తా హరికృష్ణ మరియు వారికు టుంబ సభ్యులచే అన్న ప్రసాద వితరణ చేయబడును .కనుక యావన్మంది భక్తాదులు పై కార్యక్రమంలో పాల్గొని శ్రీ స్వామివారి కృపకు పాత్రులు కావలె నని ఆలయ ఈవో మంజుల తెలియజేశారు.

## సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే వరద



ప్రొద్దుటూరు ఆగస్టు 01 ప్రభాతవార్త

జమ్మలమడుగు నియోజకవర్గం గూడెం చెరువు గ్రామంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు కడప జిల్లాకు విచ్చేసిన సీఎం చంద్రబాబు నాయుడు ను శుక్రవారం కడప విమానాశ్రయం లో కలిసిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే వరద ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని ధైర్యంగా ఉండాలని ఆయన వరదకు సూచించారు.

## హైకోర్టు లేదా సుప్రీం కోర్టు ఇచ్చిన బెయిల్‌ను ట్రయల్ కోర్టు రద్దు చేయవచ్చు

(సుప్రీం కోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, ఆగస్టు 01 ప్రభాతవార్త :

ఓ రాజకీయ నాయకుడి హత్య కేసులో కర్ణాటక మాజీ శాసన సభ్యుడు సాక్ష్యాలను తారుమారు చేశారనే ఆరోపణల నేపథ్యంలో అతడు షరతులను ఉల్లంఘించినట్లయితే రాజ్యాంగ న్యాయస్థానం మంజూరు చేసిన బెయిల్‌ను కూడా ట్రయల్ కోర్టు రద్దు చేయవచ్చని తాజాగా సుప్రీం కోర్టు ఓ తీర్పును వెలువరించింది. ఓ నిందితుడి బెయిల్‌ను రద్దు చేస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, సతీష్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులను జారీ చేసింది. "ప్రతివాది సాక్షులను సంప్రదించడానికి లేదా ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని సూచించడానికి తగినన్ని ఆధారాలు రికార్డులో ఉన్నాయని పేర్కొనడం సరిపోతుంది" అని న్యాయస్థానం సుస్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులు జారీ చేసిన వారం లోపు ట్రయల్ కోర్టు లేదా జైలు అధికారుల ముందు నిందితుడు లొంగిపోవాలని ట్రయల్ కోర్టు ఉన్నత న్యాయస్థానం అభిప్రాయాల ప్రభావం లేకుండా విచారణను త్వరగా పూర్తి చేయడానికి ప్రయత్నించాలని సూచించింది. విచారణ ఇంకా కొనసాగుతున్నందున కోర్టు ఆరోపణల పరిశీలనకు వెళ్ళలేదు. అయితే బెయిల్ రద్దు చేయాలన్న సిబిఐ దరఖాస్తును స్వీకరించడానికి ట్రయల్ కోర్టు నిరాకరించింది. సుప్రీం కోర్టు మంజూరు చేసిందనే కారణంగా ఆ నిర్ణయం తీసుకున్నది. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ ట్రయల్ కోర్టు ఈ దరఖాస్తును స్వీకరించవచ్చుని ధర్మాసనం ఆ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. ట్రయల్ కోర్టు తీసుకున్న నిర్ణయం గురుచరణ్ సింగ్ ఎదిరి స్టేట్ (ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్), ఎఐఆర్ 1978 ఎస్‌సి 179 కేసు తీర్పునకు అనుగుణంగా లేదని తేల్చి చెప్పింది. "ట్రయల్ కోర్టు వైఖరి గురుచరణ్ సింగ్ (సుప్రా) కేసులో ఈ కోర్టు తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా లేదని ప్రతివాదిని ట్రయల్ కోర్టు సముచితంగా భావించే షరతులపై రెగ్యులర్ బెయిల్ పై విడుదల చేయాలని ఆదేశించింది. కొన్ని షరతులను ఉదాహరణగా చూపుతూ ట్రయల్ కోర్టు అనేది సెషన్స్ కోర్టుగా ఉండటం వలన రాజ్యాంగ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినప్పటికీ విధించిన బెయిల్ షరతుల ఉల్లంఘన జరిగితే దాని ఆధారంగా బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ బిఎన్ఎస్ఎస్ 483(3) పూర్వపు సిఆర్‌పిసి సెక్షన్ 439(2) క్రింద దాఖలయ్యే దరఖాస్తును స్వీకరించే హక్కు కలిగి ఉంటుంది." అని కోర్టు తెలుపుతూ సాక్ష్యాలను తారుమారు చేసినందుకు నిందితుడి బెయిల్‌ను రద్దు చేయాలని సిబిఐ కోరింది. గతంలో జరిగిన హత్య కేసులో ఆ నిందితుడు 2020 లోనే అరెస్ట్ అయ్యారు, కానీ 2021 లో బెయిల్ పై విడుదలయ్యారు. (సీబీఐ ద్వారా కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఎదిరి వినయ్ రాజశేఖరప్ప కులకర్ణి, ఎస్ఎల్‌పీ (సీఆర్ఎల్) నెం.7865/2025)

# తల్లిపాలు బిడ్డకు సంజీవని

- డా.లక్ష్మీ ప్రసన్న, సీడీపీవో భారతి

కలికిరి, ఆగస్టు 1, ప్రభాతవార్త:

తల్లిపాలు బిడ్డకు సంజీవని అని ప్రతి తల్లి శిశువుకు ప్రసవం అయిన అర గంట లోపే పాలు పట్టించాలని పిలుపునిచ్చారు. వాయల్పాడు సీడీపీఓ భారతి తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేద్దామని సంయుక్తంగా తెలిపారు. ఆగస్టు నెల 1వ తేదీ నుంచి 7 వరకు విశ్వ వ్యాప్తంగా ఈ ఉత్సవాలను వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు కలిసి నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తల్లుల అవగాహన సమావేశంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలకు ప్రత్యామ్నాయం వేరే ఏమీ లేదని తల్లిపాలు స్వచ్ఛమైనవని కల్తీ లేనివని శిశువుకు దేవుడు ఇచ్చిన వరమని బలవర్ధకమైన ఆహారం శిశువుకు తల్లి పాలు మొదటి ఆరు నెలలు తప్పక ఇవ్వాలన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ తల్లిపాల వలన శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటువ్యాధులకు గురికాకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అదే సమయంలో తల్లికి, బిడ్డకు మధ్య బంధం మరింత బలపడుతుందన్నారు. తల్లిలో గర్భాశయం యదాస్థానానికి రావడానికి సాధ్యమవుతుందన్నారు. తల్లి పాలు బిడ్డకు త్వరగా జీర్ణం అవుతాయన్నారు. అలాగే తల్లికి కూడా పలు రకాల అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. ఈ తల్లిపాల వారోత్సవాలలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో, ఆరోగ్య కేంద్రాల్లో తల్లులకు, గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల వల్ల కలుగు లాభాల గురించి అవగాహన కల్పిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు సుధాకర్, గిరిజమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## శ్రీ భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు

చిట్వేలి, ఆగస్టు 1, ప్రభాతవార్త:



స్థానిక పాత చిట్వేలి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా శుక్రవారం అమ్మవారికి అర్చకులు మృత్యుంజయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిమళభరిత పూలతో, పట్టు వస్త్రాలత, ఆభరణాలతో అమ్మవారు దివ్యంగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజాది క్రతువులు, మహా మంగళ హారతి, దూపదీప నైవేద్యాలను సమర్పించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు భక్తులందరికీ తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

## ఎమ్మార్పీ ధరలకే యూరియా

పోరుమామిళ్ల రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త:



పోరుమామిళ్ళ మండలం లోనీ రైతులకు ఎమ్మార్పీ ధరలకే యూరియాను శుక్రవారం పంపిణీ చేయడం జరిగింది. ప్రతి ఎరువుల దుకాణం వద్ద వ్యవసాయ సిబ్బంది ఉంచి యూరియా అవసరైన రైతులకు ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు చేయించారు. ప్రతి రైతు కావలసిన ఎరువులను ఎమ్మార్పీ ధరలకే లభించును, అలాగే సంబంధిత రైతు సేవ కేంద్ర లలో గ్రామ వ్యవసాయ సహాయకులు కలిసి మీకు కావలసిన ఎరువులను పొందవచ్చునని, సహాయా వ్యవసాయ సంచాలకులు, పోరుమామిళ్ల మురళీధర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి, పోరుమామిళ్ళ చంద్ర మోహన్ రెడ్డి లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా

సీడీపీఓ సునీత

పులివెందుల, ఆగస్ట్ 1, ప్రభాతవార్త:

తల్లి యొక్క ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా అని సీడీపీఓ సునీత అన్నారు. పులివెందుల 3 సెక్టార్ లోని క్రిస్టియన్ లైన్ 2 అంగన్వాడీ సెంటర్ లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది, ఈ కార్యక్రమం లో భాగంగా ప్రాజెక్ట్ సీడీపీఓ సునీత మాట్లాడుతూ తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి అమృతం వంటివని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, అప్పుడే పుట్టిన శిశువు కి ముర్రు పాలు మొదటి టీకా తో సమానం అని, అలాగే శిశువు కి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే త్రాగించాలని, డబ్బాపాలు త్రాగించరాదని, బరువు తక్కువగా పుట్టిన పిల్లలు తల్లిపాలు సరిగా త్రాగలేరని, అటువంటి పిల్లలకు తల్లిపాలు త్రాగించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి, తల్లిపాలు త్రాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంతో పాటుగా గర్భాశయ, బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా తల్లులు ఆరోగ్యంగా ఉండగలరనీ అలాగే డబ్బా పాలు త్రాగే పిల్లలలో కంటే తల్లిపాలు త్రాగే పిల్లలలో ప్రజ్ఞా స్థాయి ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో సెక్టార్ సూపెర్వైసోర్ హేమలత, అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్, ఆశ, తదితరులు పాల్గొన్నారు.



# ఆకట్టుకుంటున్న క్రాఫ్ట్ బజార్

క్రాఫ్ట్ బజార్‌కు తగ్గని ఆదరణ

మదనపల్లె, ఆగస్టు 1 ప్రభాతవార్త :

మదనపల్లె పట్టణంలోని మిషన్‌కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్, చేనేత వస్త్ర హస్తకళ ప్రదర్శన, అమ్మకాలు ఆకట్టుకొంటున్నాయి. జూన్‌నెలలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా చేతుల ఈ హస్తకల ప్రదర్శన ప్రారంభించారు.అప్పటి నుంచి మిషన్‌కాంపౌండ్‌లో ఏర్పాటుచేసిన క్రాఫ్ట్ బజార్‌లో కొనుగలుదారులతో రద్దీగా మారుతోంది. ఇక్కడ అనేక రకాల గృహోపకర వస్తువులు, మహిళలు వినియోగించే వస్తువులు, పలు రకాల దుస్తులు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా వరంగల్ టవల్స్, రాజస్థాన్ గాజులు, ఇమిటేషన్ జ్యువలరీ, సారంగపూర్ ఉడ్ ఐటమ్స్, బెంగాలి కాటన్ శారీస్, ఊటి ఫ్రూట్స్, తమిళనాడు బెడ్ షీట్స్, జైపూర్ బెడ్‌షీట్స్, డోర్ కర్టెన్స్, ఖాదీషర్టులు, రెడిమేడ్ డ్రస్సులు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువలరీ, ఫ్లవర్‌పార్ట్స్, కళంకారి చీరలు, డ్రస్సులు అనేక రకాల వైరటీలు అందుబాటులో ఉన్నాయి. నాణ్యమైన దుస్తులు, పురుషుల టీషర్టులు, ప్యాంట్స్, లోయర్స్, పంచలు, మహిళలకు సంబంధించిన పలు రకాల చీరలు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 11గంటల నుంచి రాత్రి 9.30గంటల వరకు ఈ స్టాల్స్ ఓపెన్‌లో ఉంటాయి. కొనుగోలుదారులు మిషన్‌కాంపౌండ్‌లో ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్‌కు వచ్చి నాణ్యమైన దుస్తులు, వస్తువులను తక్కువ ధరలకే కొనుగోలు చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు. క్రాఫ్ట్‌బజార్‌కు ఆదరణ తగ్గకుండా ఉంది.

